క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



గోర్జి పరిశీలిస్తున్న సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ గోర్జిలో ఆక్రమణలు మంగళవారం తొలగించారు. గోర్జిలో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు పైడి వాసుదేవరావు, టి.వరలక్ష్మి, ఎస్.పద్మ తదితరులు స్పందనలో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల సర్వేయర్ తమ్మయ్య స్వామి, సచివాలయ రెవెన్యూ సిబ్బంది గోర్జి పరిశీలించారు. రికార్డుల మేరకు సర్వే నిర్వహించారు. అనంతర అక్రమణలు తొలగించి హద్దురాళ్లు వేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులోని మలిపెద్దివాని కోనేరు(చెరువు)లో ఉపాధి పనులు నిర్వహించాలని సర్పంచ్ పంచి రెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావు కలెక్టరేట్ స్పందనలో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ లోకేష్, ఏపీఎం శోభాదేవిలతో కూడిన బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. చెరువు విస్తీర్ణం 2.60 ఎకరాలు కాగా, పూర్తిస్థాయిలో పనులు చేయాలని స్థానికులు కోరారు.

విశ్రాంత డీఎస్పీ మృతి



సూర అప్పలనాయుడు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామానికి చెందిన విశ్రాంత డీఎస్పీ సూర అప్పలనాయుడు (63) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో ఎస్సై నుంచి డీఎస్పీ హోదాలో పలు పోస్టింగ్‌లు చేపట్టి మంచి అధికారిగా పేరు సాధించారు. విశాఖపట్నంలో విశ్రాంత జీవితం గడుపుతూ అక్కడి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. మృతుడి స్వగ్రామం ఫరీదుపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి అన్నారు. ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక అమలుపై మంగళవారం గొలివివానిపేటలో రైతులకు పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగం తగ్గించాలని సూచించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఘన, ద్రవ జీవామృతాలు వినియోగించాలని సూచించారు. పురుగు మందులకు బదులు కషాయాలు వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల మెరుగైన పంటల దిగుబడి, కలుషితం లేని ఆహారం సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ' డాక్టర్‌తో మేలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు మేలు జరుగుతుందని లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మణిభూషణ్ అన్నారు. జీజీవలసలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఆర్.రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ఆరా

జి.సిగడాం : స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఆర్ఐ రామచంద్రరావు, సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు తదితరులు మంగళవారం గెద్దకంచరాం, జాడ గ్రామాల్లో ఆరా తీశారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను సచివాలయం పరిధిలోనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పొట్నూరు జగన్నాథం, నీలకంఠం, సచివాలయం సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

- దేశంలోనే ఆదర్శ పాలన సాగిస్తున్న సీఎం జగన్
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రం అందించని ఆదర్శ పాలన సాగిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండలం సంత సీతారాంపురంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. రేషన్ కార్డు వారీగా లబ్ధిదారులకు వర్తించిన పథకాల బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు పథకాలతో పేదరికం నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామం యూనిట్‌గా గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ రూపొందించి అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. ప్రతి పక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారం నమ్మవద్దని హితవుపలికారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో తెలుగుదేశం పార్టీ వారికి చెందిన వారికి మాత్రమే పథకాలు అందజేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అంజేస్తున్నట్లు వివరించారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసకున్న మూడు నెలల్లోఅందజేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నకల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, నాయకులు మూగి శ్రీరాములు, మాడుగుల మురళీధర్‌బాబా, సింహాచలం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ, దుంప చిన్నారెడ్డి, అలుపన బుజ్జి, గవిరెడ్డి రవికుమార్, సత్యనారాయణ, బెండు రామారావు, బొడ్డేపల్లి సుధ తదితరులు పాల్గొన్నారు.

పెదరావుపల్లిలో సచివాలయ భవనాలు ప్రారంభం



సచివాలయ భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం పెదరావుపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం భవనాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగానే అన్ని రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు అందాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ సీతంనాయుడు, ఏఈ లింగాల అప్పన్న, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈలు కె.అప్పలనాయుడు, బి.శివబాబు, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్ చాన్‌బాషా, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఆరంగి రమణబాబు, పెదరావుపల్లి సర్పంచ్ కొన్ని హేమసుందర్, మాజీ సర్పంచ్ ఆరంగి అప్పారావు, నాయకులు బొడ్డ రవిబాబు, పెద్ది చిరంజీవి, ఆరంగి శ్రీరామ్మూర్తి, అలుపున నారాయణరెడ్డి, జగ్గురోతు తవిటినాయుడు, సూరాల అప్పన్న, కొన్ని రమణమూర్తి, పెద్ది ఆదినారాయణ, కొన్ని శ్రీనివాసరావు, అచ్చెన్న, క్రిష్టారావు, రాము, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీలో ముగిసిన నాక్ బృందం పరిశీలన



గాయత్రీ స్థూపంవిశిష్టతను వివరిస్తున్న విద్యాసంస్థల అధినేత స్వామినాయుడు

శ్రీకాకుళం రూరల్: గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ అనుబంధ సంస్థ గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్సు అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన నాక్ బృందం తనిఖీలు మంగళవారంతో ముగిశాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తెలిపారు. బృందం చైర్‌పర్సన్‌గా కాలడి (కేరళ) ఆదిశంకరాచార్య సాంస్కృతిక కళాశాల పూర్వ ఉపకులపతి ఆచార్య మొనిపల్లి చంద్రశేఖరన్ నాయర్ దీపక్‌కుమార్, చెన్నైలోని అన్నామలై విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు, విభాగాధిపతి సుందరమూర్తి పెరుమాల్, కోఆర్డినేట్ సభ్యులుగా మంగుళూర్ సెయింట్ ఆలోయిసెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ మార్టిస్ వ్యవహరించినట్లు పేర్కొన్నారు. రెండురోజుల పాటు ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, జిమ్, వివిధ విభాగాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సోలార్ ప్లాంట్, నీటి సదుపాయాలు, మెస్, ఆఫీస్, క్యాంటీన్ తదితర సౌకర్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, డైరెక్టర్ సంయుక్త, పొన్నాడ రమేష్, రంగారావు, ఐక్యూ సమన్వయకర్త మార్తాండ కృష్ణ, సీతారాములునాయుడు, వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి

- రోజు రోజుకు పెరుగుతున్న వడగాలులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



నిర్మానుష్యంగా జీటీ రోడ్డు

శ్రీకాకుళం: పేదల ఊటీగా పేరుగాంచిన శ్రీకాకుళంలో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. నాలుగు రోజుల క్రితం వరకు 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణగతలు నమోదు కాగా ప్రస్తుతం 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజులు మరింత పెరిగే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలని, గొడుగు, టోపీ వంటివి వినియోగించాలని చెబుతున్నారు. ద్రవ పదార్థాలు రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్లు తీసుకుంటే వడదెబ్బ నుంచి బయటపడగలమని నిపుణులు సూచిస్తున్నారు. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్ఎస్, కొబ్బరి నీరు, పల్ల రసాలు వంటివి తీసుకోవాలని, మసాలాలు తగ్గించాలని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు ఎండల ప్రభావంతో ఉదయం 11 గంటల నుంచే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వినియోగదారులు లేక వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. సాయంత్రం వేళ వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి.

అప్రమత్తత అవసరం



ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు మరింత జాగ్రత్తగా ఉండాలి. ద్రవపదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి.

–డాక్టర్ రవితేజ, అత్యవసర విభాగం, రిమ్స్ ఆస్పత్రి

మహాత్ములను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఎచ్చెర్ల: మహనీయుల జీవిత చరిత్రను వివరిస్తున్న చంద్రశేఖరరావు



రణస్థలం: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



లావేరు: అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్ మణిబాబు

ఎచ్చెర్ల: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకోవాలని ధర్మవరం శాఖా గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సురేష్, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రణస్థలం: పుస్తక పఠనంతో సంపూర్ణ విజ్ఞానం లభిస్తుందని రణస్థలం శాఖ గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. వేసవి శిబిరాల్లో భాగంగా దినపత్రికలు, పుస్తక పఠనం, చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: దేశ భౌగోళిక పరిస్థితులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రిసోర్సుపర్సన్ వి.మణిబాబు అన్నారు. మురపాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్లోబ్ ద్వారా భౌగోళిక పరిస్థితులు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

విజయగణపతికి క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో విజయగణపతి

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని నానుబాలవీధి వద్ద విజయగణపతి ఆలయంలో మంగళవారం అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, పెంట నగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఎన్ఈఆర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఎచ్చెర్ల నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎన్.ఈశ్వరరావు తండ్రి అప్పలకొండ మృతిచెందడంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, పార్టీ శ్రేణులు ఉన్నారు. అదే విధంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, పార్టీ నాయకులు గద్దె బాబూరావు, రెడ్డి పావని, పైడి వేణుగోపాలం, బూర్లె శ్రీధర్, హరనాథ్ తదితరులు పరామర్శించారు.

భద్రమ్మ తల్లికి చల్లదనం



పూజలందుకుంటున్న భద్రమ్మతల్లి

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళంలోని బలగలో గల భద్రమ్మ తల్లి ఆలయంలో వైశాఖ మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని చల్లదనంలో భాగంగా భద్రమ్మ తల్లికి వారాల పండగలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, చిన్నారులు కోలాటం, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు భద్రమ్మతల్లి ఆలయ కమిటీప్రతినిధులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



రణస్థలం: సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రాజేష్



జి.సిగడాం: జాగృతి-యువత కోసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, అధికారులు

రణస్థలం: చెడు వ్యసనాలతో జీవితం నాశనం చేసుకోవద్దని, సమాజంలో జరుగుతున్న మంచి చెడులతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. రణస్థలంలోని దేవిశ్రీ కల్యాణ మండపంలో 'జాగృతి- యువత కోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలు, ఇతర గొడవల్లో యువత తలదూర్చి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హితవుపలికారు.గ్రామాభివృద్ధికి దోహదపడే అంశాలను గ్రామ పెద్దలకు తెలియజేసి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీస్ చట్టాలు, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై స్పష్టమైన అవగాహన ఉండాలని చెప్పారు. ఉద్యోగం, భవిష్యత్ కార్యచరణపై దృష్టి సారించాలే తప్పా చెడు వ్యసనాల బారిన పడవద్దన్నారు. గంజాయి, మద్యం, సిగరెట్లు, గుట్కా వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ధనుంజయరావు, కళాకారుడు భోనం గురుమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం..

జి.సిగడాం: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపైనే యువత దృష్టి సారించాలని జి.సిగడాం ఎస్ఐ సామంతుల రామారావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఎంఈఓ అరసాడ రవి అన్నారు. మంగళవారం స్థానిక బలిజి కల్యాణ మండపంలో 'జాగృతి-యువత కోసం' సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా యువత అడుగులు వేయాలన్నారు. ప్రతి మహిళా దిశయాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బాలికలను వేధింపులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు, యువత, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి మహిళా ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి పిలుపునిచ్చారు. ముద్దాడ గ్రామంలో మంగళవారం పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయ సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని, నవరత్నాలు పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు మహిళల ఖాతాల్లో జమవుతున్నాయని గుర్తు చేశారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత పాలన పోల్చి చూడాలని కోరారు. ఈ ప్రభుత్వం వచ్చాక ముద్దాడలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.5.28 కోట్ల ప్రయోజనం చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మాడుగుల మురళీధర్‌బాబా, సర్పంచ్ ముద్దాడ శంకరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి, నాయకులు బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘ నాయకులపై చర్యలు తీసుకోవాలి



సింహాచలంను నిలదీస్తున్న రిమ్స్ కార్మికులు

శ్రీకాకుళం: రిమ్స్ కార్మికుల సంఘ నాయకులుగా చలామణి అవుతున్న గణేష్, సింహాచలంలు కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడుతూ అక్రమాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రిమ్స్ ఆస్పత్రి కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రిమ్స్ ఆసుపత్రి వద్ద సింహాచలాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా కార్మికులను శ్రమదోపిడీ చేస్తూ కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. యూనియన్ ఫండ్ కింద వసూలు చేసిన లక్షలాది రూపాయలకు లెక్కలు చెప్పడం లేదన్నారు. మహిళా కార్మికులను దుర్భాషలాడుతూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని మండిపడ్డారు. వీరిద్దరిపైనా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారులకు బాలవికాస్ తరగతులు



శిక్షణ ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళంలోని సత్యసాయిబాబా పెద్ద మందిరంలో మంగళవారం సత్యసాయి బాలవికాస్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. 14 ఏళ్ల బాల బాలికలకు నైతిక, మానవతా విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, జాతీయ పండగలు, విశిష్టతను వివరించారు. బాల బాలికల్లో అంతర్గతంగా ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా డ్రాయింగ్, క్రాఫ్ట్, సంగీతం, పాటలు, ఏకపాత్రాభినయం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి పెద్ద మందిరం పూర్వపు జిల్లా పథాధికారి ఎస్.ఎస్.మూర్తి, సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ కో-ఆర్డినేటర్ సూర రామచంద్రారావు, మందిర కన్వీనర్ కె.మురళీకృష్ణ, బాల వికాస్ జిల్లా పథాధికారులు ఏ.సూర్యకళ, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



గ్రామదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం అర్బన్: పాత శ్రీకాకుళంలో పెద్దమ్మతల్లి గ్రామదేవత ఆలయం పదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహదాత విభూది సూరిబాబు తొలి పూజ చేశారు. వేకువ జామున అమ్మవారికి శుద్ధిస్నానం, క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయం పునఃప్రతిష్ట చేసి నేటికి పదేళ్లు పూర్తయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు డీపీ.దేవ్, లోకనాథం, నాగరాజు, గంజి తాతారావు, అదపాక రాంబాబు, శ్రీనివాసరావు, చిన్నారావు, నక్క కృష్ణ, గోవింద మల్లిబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

బూర్జ: మండలంలోని అన్నపేట గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.మల్లేశ్వరరావు ఉపాధి పనుల్లో పలు అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఏపీఓ వి.రాజ్‌కుమార్ ఆ గ్రామానికి మంగళవారం వెళ్లి ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. బినామీ మస్తర్లు, ఒకరికి బదులు వేరొకరు వేస్తున్నారని రుజువుకావడంతో.. మరలా ఇలాంటి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి తనిఖీలు చేయాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.